
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
**

సూర్యాపేట
3
గురువారం 18 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.119	173	196
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.119	173	196

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 18.0

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మొత్తం 19 మునిసిపాలిటీలకు ఎనిమిది పురపాలక సంఘాల్లో అవిశ్వాసానికి తెరలేపారు. నల్లగొండ మునిసిపాలిటీకి సంబంధించి అవిశ్వాసం నెగ్గడంతో బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్మన్ సైదిరెడ్డి పదవిని కోల్పోయారు. అదేవిధంగా కోదాడ, నాగార్జున సాగర్ మునిసిపాలిటీలకు సంబంధించి కోర్టుల్లో స్టే ఉండటంతో అవిశ్వాసంపై తదుపరి చర్యలు నిలిచిపోయాయి.

- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి, సూర్యాపేట)/నల్లగొండ



అవిశ్వాస సమావేశాలకు వేళాయె..

- 23న నేరేడుచర్ల, భువనగిరి మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మాన సమావేశం
- 24న హుజూర్‌నగర్, 27న సూర్యాపేట, ఆలేరులో..
- కోదాడ, నాగార్జునసాగర్‌పై కోర్టు స్టే
- జడ్పీ చైర్మన్లపై కనిపించని అవిశ్వాసాలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 మునిసిపాలిటీలు ఉండగా అందులో సూర్యాపేట జిల్లాలో ఐదు, యాదాద్రిభువనగిరి జిల్లాలో ఆరు, నల్లగొండ జిల్లాలో ఎనిమిది ఉన్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మునిసిపాలిటీలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకోగా ప్రస్తుతం తిరుమలగిరి మినహా అన్నింట్లోనూ అవిశ్వాస పర్వాలు మొదలయ్యాయి. సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, వైస్‌చైర్మన్ పుట్ట కిశోర్‌పై అవిశ్వాస నోటీసుపై ఈ నెల 27వ తేదీన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు 30మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 15మంది తీర్మానానికి అనుకూలంగా సంతకాలు చేశారు. కోదాడ మునిసిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్ చైర్‌పర్సన్ పద్మలపై కూడా అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. అయితే అధికారులు సరైన పద్ధతిలో నోటీసులు ఇవ్వలేదని వారిద్దరూ కోర్టుకు వెళ్లడంతో సమావేశం నిర్వహణకు జాప్యం జరిగింది. కోర్టు మార్గదర్శకాల ప్రకారం అధికారులు త్వరలో తేదీని ప్రకటించే అవకాశం ఉంది. అదేవిధంగా హుజూర్‌నగర్ వైస్‌చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావుపై ఈ నెల 24వతేదీన అవిశ్వాసంపై ఓటింగ్ జరుగనుంది. నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు అధికారులు ఈ నెల 23వ తేదీని నిర్ణయించారు. ఇక నల్లగొండ జిల్లాలో ఎనిమిది మునిసిపాలిటీలను 2020లో బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది.

● నల్లగొండ మునిసిపాలిటీకి సంబంధించి ఈ నెల 8వ తేదీన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కొత్త చైర్మన్‌ను ఎన్నుకోవడానికి నోటిఫికేషన్ రావాల్సి ఉంది. అదేవిధంగా నందికొండ(నాగార్జునసాగర్) మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాసానికి నోటీసులివ్వగా వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించింది. మిర్యాలగూడ, హాలియా, చండూరు మునిసిపాలిటీల్లో బీఆర్‌ఎస్ పాలకవర్గాలు ఉన్నాయి. స్థానిక పరిస్థితుల దృష్ట్యా అవిశ్వాసం పెట్టే ఆలోచనలో ఇతర పార్టీలు లేవు. దేవరకొండ, చిట్యాల మునిసిపల్ చైర్మన్లు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఇక్కడ అవిశ్వాసం సమస్య లేదు. నకిరేకల్ మునిసిపాలిటీకి ఏడాది ఆలస్యంగా ఎన్నికలు జరగడంతో ప్రస్తుతం అవిశ్వాసానికి అవకాశం లేదు.

యాదాద్రి జిల్లాలో రెండు మునిసిపాలిటీల్లో..

యాదాద్రి జిల్లాలో భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూరు, చౌటుప్పల్ మునిసిపాలిటీలు ఉన్నాయి. వీటిలో భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ మునిసిపాలిటీ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలకు సిద్ధమయ్యారు. ఎన్నికల ముందుగానే కలెక్టర్లకు అవిశ్వాసం తీర్మాన నోటీసులను ఇచ్చినప్పటికీ అప్పటి ప్రభుత్వం ఒత్తిడితో నోటీసులు జారీచేయలేదు. ఎన్నికల అనంతరం మరోసారి అవిశ్వాసాలకు తెరలేపారు. భువనగిరి మునిసిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్యలపై అవిశ్వాస నోటీసులపై ఈ నెల 23న ప్రత్యేక సమావేశానికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 35మంది కౌన్సిలర్లకు 31మంది అవిశ్వాసానికి మద్దతు నిలిచారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంది. అదేవిధంగా ఆలేరు మునిసిపాలిటీ చైర్మన్ వస్పరి శంకరయ్యపై అవిశ్వాస సమావేశాన్ని ఈ నెల 27న నిర్వహిస్తున్నారు. మొత్తం 12మంది కౌన్సిలర్లలో 8మంది అవిశ్వాసానికి బలపరుస్తూ సంతకాలు చేశారు. ఆలేరులోనూ అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట, చౌటుప్పల్ మునిసిపాలిటీల్లోనూ ఎన్నికలకు ముందు అవిశ్వాసాలకు కలెక్టర్‌కు విన్నవించారు. యాదగిరిగుట్ట, చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో రాజకీయ పరిణామాలు మారిపోవడంతో ఆయా మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు ఉంటాయా? లేదా అన్నది వేచి చూడాల్సిందే.

జడ్పీ చైర్మన్ల విషయంలో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జడ్పీ చైర్మన్లపై అవిశ్వాసానికి సంబంధించి ఎటువంటి కదలికలు లేవు. యాదాద్రిభువనగిరి జిల్లా పరిషత్‌లో 17మంది జడ్పీటీసీలు ఉన్నారు. వీరిలో 12 మంది బీఆర్‌ఎస్, 5మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు.కాగా ఇప్పటివరకు బీఆర్‌ఎస్ నుంచి ఏ ఒక్క జడ్పీటీసీ పార్టీ మారలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రామన్నపేట జడ్పీటీసీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జిల్లా పరిషత్ చైర్మన్‌పై అవి శ్వాసంపై ఇప్పటివరకు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోలేదు. సూర్యాపేట జిల్లాలో 2020లో జరిగిన ఎన్నికల్లో 23 మండలాలకు 20 మంది జడ్పీటీసీలు బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. ముగ్గురు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. గత ఎన్నికల సమయంలో కోదాడ నియోజకవర్గంలో ఆరుగురు జడ్పీటీసీలు, నేరేడుచర్ల జడ్పీటీసీ మొత్తం ఏడుగురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినప్పటికీ ఇప్పటి వరకు అవిశ్వాసానికి సంబంధించి ఎటువంటి పరిణామాలు చోటుచేసుకోలేదు. నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ఆలోచనలో కాంగ్రెస్ లేదు. ఎన్నికల సమయంలో మొత్తం 31మండలాల జడ్పీటీసీల్లో కాంగ్రెస్‌కు 8మంది జడ్పీటీసీలు బలం ఉండగా, బీఆర్‌ఎస్ నుంచి 23మంది గెలిచారు. బీఆర్‌ఎస్‌కి చెందిన బండా నరేందర్‌రెడ్డి పదవికాలం ఈ ఏడాది జులైతో ముగుస్తుంది. దీంతో అవిశ్వాసం పెట్టే ఆలోచనకు ఎవరు రాలేదు. ఇటీవల మారిన రాజకీయ బలాబలాను పరిశీలిస్తే అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిప్పర్తి, మునుగోడు జడ్పీటీసీలు కాంగ్రెస్‌లు చేరడంతో కాంగ్రెస్ బలం 10కిచేరగా,బీఆర్‌ఎస్ జడ్పీటీసీలు 21 మంది ఉన్నారు.

గుట్టుగా రంగు రాళ్ల దందా

- అర్ధరాత్రి వేళల్లో లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు


నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామ శివారు డంప్ చేసిన రంగురాళ్లు

మిర్యాలగూడ, జనవరి 17: కొందరు అక్రమార్కులు రంగురాళ్లను గుట్టుచప్పుడు కాకుండా సేకరించి వాటిని ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కృష్ణానది తీరం వెంట అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా రంగురాళ్ల దందాను కొనసాగిస్తున్నారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని ముదిమాణిక్యం పరిధిలో కృష్ణానది ఒడ్డున కొంతమంది ఈ దందాను కొనసాగిస్తూ కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. ఈ రంగురాళ్లను ఇంటి నిర్మాణంలో సుందరీకరణకు వాడుతుండటంతో మంచి గిరాకీ ఉంటోంది. ఎక్కడా దొరకని గుండ్రటి, నున్నటి రంగురాళ్లు ముదిమాణిక్యం కృష్ణానది తీరంలో దొరుకుతుండటంతో హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో వీటికి మంచి గిరాకీ ఉంది. ఈ అక్రమ వ్యాపారంలో కొందరు నేతల హస్తం కూడా ఉంది. నదీ తీరంలో కూలీల ద్వారా ఈ రాళ్లను సేకరించి లారీల కొద్దీ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ తతంగం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఈ వ్యవహారంపై సంబంధిత శాఖ అధికారులకు పలువురు ఆధారాలు సహా సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామంలో చర్చించుకుంటున్నారు.

ముదిమాణిక్యం కేంద్రంగా దందా

కృష్ణానది తీరంలో ఎక్కడా కనిపించని ఎరుపు, నలుపు, ఆకుపచ్చ, పలుగురాళ్ల రంగులో నున్నగా, గుండ్రంగా ఉండే రాళ్లు లభిస్తున్నాయి. వీటికి ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉండటంతో రాళ్ల ఆకృతిని బట్టి టన్నుకు రూ.9వేల నుంచి రూ.10వేల వరకు ధర పలుకుతోంది. ఖరీదైన ఆధునిక భవనాల ఎలివేషన్‌కు, పాలిష్ చేసి పేపర్ వెయిట్ లాగా, అక్వేరియాలు, పార్కులు, ఫౌంటెన్ల వద్ద అలంకరణలో విరివిగా వినియోగిస్తుండటంతో ఈ రకం గుండ్రాళ్లకు బయటి రాష్ట్రాల్లో అధిక ధర ఉంది. ముదిమాణిక్యం ప్రాంతంలో ఈ గుండ్రాళ్లను కూలీల ద్వారా సేకరించి ట్రాక్టర్ల ద్వారా గ్రామశివారులోకి తరలించి డంప్ చేస్తున్నారు. గ్రామంలో మధ్యవర్తుల ద్వారా రోజుకు రూ.300 చొప్పున దినసరి కూలీలను వినియోగించి ఎక్కువ మొత్తంలో రాళ్లను సేకరించి పోగు చేసిన తర్వాత రాళ్లను సైజుల వారీగా, నాణ్యతాపరంగా గ్రేడింగ్ చేసి అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా అక్రమవ్యాపారులు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తున్నారు. నెలకు 8 నుంచి 10 లారీల్లో ఈ రాళ్లు తరలుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. 12 టైర్ల లారీల్లో 28 నుంచి 30 టన్నుల వరకు రంగురాళ్లను తరలిస్తుండగా, ఖర్చులు పోగా సుమారు రూ.1.5లక్షలు మిగులుతాయని సమాచారం. ఏళ్ల తరబడి ఈ దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నిఘా కొనసాగుతోంది

కొంతకాలం క్రితం స్థానికులు ఫిర్యాదులతో రంగురాళ్లను అక్రమ రవాణా చేస్తున్న మూడు వాహనాలను పట్టుకున్నాం. ఇటీవల ఫిర్యాదులు అందలేదు. కృష్ణా పరివాహక ప్రాంతం అటవీ ప్రాంతంలో ఉన్నందున రాళ్ల సేకరణ సమయంలో ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలి. రంగురాళ్ల అక్రమ రవాణాపై నిఘా పెంచాం.

- వెంకటేశ్వర్లు, మైనింగ్‌శాఖ ఏడీ, మిర్యాలగూడ

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

టెయిల్ పాండ్ సమీపంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో రోజు వారీ కూలీలు లోడుకు సరిపడా రాళ్లు సేకరించగానే గ్రేడింగ్ చేసి ఎరువుల బస్తా లాంటి తెల్లని సంచుల్లోకి ప్యాకింగ్ చేస్తారు. మిర్యాలగూడ ప్రాంతం నుంచి లారీని రప్పించి అర్ధరాత్రి సమయంలో లోడ్ చేసి రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దులో ముదిమాణిక్యం సమీపంలోని టెయిల్ పాండ్ వంతెన రహదారి మీదుగా ఏపీ రాష్ట్రంలోనికి ప్రవేశించి అక్కడి నుంచి మహారాష్ట్ర, చెన్నై, కేరళ వంటి రాష్ట్రాలకు రంగు రాళ్లను అక్రమంగా రవాణా చేస్తున్నారు. అధికారులకు ముడుపులు చెల్లిస్తుండటంతో రంగురాళ్ల దందాపై సమాచారం ఉన్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా నామమాత్రంగా లారీలను పట్టుకొని వదిలేస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. మైనింగ్ అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కృష్ణానది తీరంలో నిఘా విలువైన ఖనిజ సంపద తరలిపోకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

'కల్యాణలక్ష్మి'తోపాటు తులం బంగారం

- త్వరలో నిర్ణయం
- ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నల్లగొండలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 17: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇచ్చేందుకు త్వరలో మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలకు పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థలాలను గుర్తిస్తామన్నారు. నియోజకవర్గంతో పాటు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు నల్లగొండలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. టీఎస్‌పీఎస్సీని యూపీపీఎస్సీ తరహాలో ప్రక్షాళన చేసి గ్రూప్-2 పరీక్ష నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు అందజేసి తగిన న్యాయం చేస్తామన్నారు. నియోజకవర్గం పరిధిలోని నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండలాలకు చెందిన 244మందికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.2,44,28,304ల విలువైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చేందుకు సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతినిధులతో జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. కమర్షియల్ వెహికిల్ మెయింటెనెన్స్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, హైడ్రాలిక్ మెషిన్ ట్రైనింగ్, అడ్వాన్స్ వుడ్ ఇంజినీరింగ్, అపెరల్ మ్యానుఫ్యాక్చరింగ్, ట్రాన్స్‌ఫార్మర్ మ్యానుఫ్యాక్చరింగ్ సిస్టమ్, కేఫ్ కాఫీడే వంటి వ్యాపారాల్లో శిక్షణ, ఉపాధి గురించి యూనివర్సిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పట్టణంలో క్లాక్‌టవర్ వద్ద కళాభారతి నిర్మాణం, అందులో కల్పించాల్సిన సౌకర్యాల కల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు, ఆర్డీవో రవి, ఈఈ రాములు, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండను మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యేగా ఐదు సార్లు గెలిపించిన నల్లగొండ ప్రజలు తనపై పెద్ద బాధ్యత ఉంచారని, నల్లగొండను మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శివాజీనగర్ సెంటర్-పానగల్‌రోడ్డు వరకు రూ.90లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్జీ కళాశాల-రామగిరి వరకు రూ.1.30కోట్లతో విస్తరిస్తున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి చేపట్టాల్సిన మార్పులపై కలెక్టర్‌కు సూచనలు చేశారు. పండ్ల మార్కెట్ వ్యాపారుల సమస్యలు విని వాటిని పరిష్కరించేందుకు నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రి వెంట కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి మునిసిపల్ చైర్మన్ అబ్బగోని రమేష్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ భవనానికి శంకుస్థాపన

జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.23.75కోట్ల వ్యయంతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ భవనానికి మంత్రి వెంకట్‌రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ డీఈ అజీజ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి, డీఎంహెచ్‌వో కొండల్‌రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌తో సమీక్ష నిర్వహించారు.


క్రిటికల్ కేర్ భవన నమూనాను చూపుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

ఒకే రోజు 87వేల వాహనాలు

- జాతీయ రహదారులపై సందడి
- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రద్దీగా మారిన టోల్ ప్లాజాలు


పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల్ రూరల్, చౌటుప్పల్ టౌన్, బీబీనగర్, చిట్యాల రూరల్, కేతేపల్లి,కోదాడరూరల్, జనవరి 17: పల్లెలు తిరిగి పట్నం బాటపట్టాయి. సంక్రాంతి సంబురాలు ముగియడంతో తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారులు రద్దీగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి జిల్లా మీదుగా హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి నెం.163, నల్లగొండ జిల్లా మీదుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి నెం.65పై ఉన్న టోల్ గేట్ల వద్ద వాహనాలు రద్దీగా విపరీతంగా కన్పించింది. ఫాస్టాగ్ ఉండడంతో అది స్కాన్ చేసి, వెళ్లేందుకు కొంత సమయం పట్టింది. అదే విధంగా జాతీయ రహదారిపై వాహనదారుల సందడితో హోటళ్లు కిటకిటలాడాయి.

ఉదయం సాధారణం.. రాత్రికి రద్దీ

ఉమ్మడి నల్లగొండ జిల్లామీదుగా పల్లెల నుంచి పట్నంకు 87వేల వాహనాలు బయలుదేరి వెళ్లినట్లు అంచనా. బుధవారం ఉదయం రద్దీ సాధారణంగానే కన్పించినా రానురాను వాహనాల సంఖ్య పెరుగుతూ రద్దీగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద 16 గేట్లకు గాను 10 గేట్ల ద్వారా హైదరాబాద్ వైపు వాహనాలను పంపించా రు. ట్రాఫిక్ జామ్ కాకుండా జీఎంఆర్ ప్రత్యేక చర్య లు చేపట్టింది. ఫాస్టాగ్ ఉండి స్కానింగ్ కాని వా హనాలను అదనపు సిబ్బందితో స్కానింగ్ చేసి పం పించారు. ఫాస్టాగ్ లేని వాహనాలకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం పంతంగి టోల్‌గేట్ నుంచి 65వేల వాహనాలు వెళ్లినట్లు జీఎంఆర్ సిబ్బంది తెలిపారు. వరంగల్-హైదరాబాద్ 163వ జాతీయ రహదారిపై సాధారణం కంటే కొద్దిగా అధికంగా ఉంది. బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా నుంచి 22వేల వాహనాలు వెళ్లినట్లు జీఎంఆర్ అధికారులు తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో ఎన్‌హెచ్65పై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. కేతేపల్లి టోల్‌ప్లాజా నుంచి బుధవారం 30వేల వాహనాలు తిరుగు ప్రయాణమైనట్లు టోల్‌ప్లాజా నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి పండుగకు ముందు ట్రాఫిక్ ఆంక్షలతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ నుంచి యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ వరకు ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. జీఎంఆర్, ట్రాఫిక్ పోలీసులు, సివిల్ పోలీసుల సమన్వయలోపంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారినట్లు పోలీసు ఉన్నతాధికారులు గుర్తించారు. ట్రాఫిక్ నియంత్రణకు అదనంగా 200మంది ప్రత్యేక పోలీసులను ఏర్పాటు చేశారు. ప్రధాన జంక్షన్ల వద్ద, హైవేపై వీరిని నియమించారు. క్రేన్‌లు, అంబులెన్స్‌లను ఏర్పాటుచేశారు. పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించారు. కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద భారీ సంఖ్యలో కార్లు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు తనిఖీలు నిలిపివేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను పంపించారు.

ట్రాఫిక్ పోలీసులకు అభినందనలు

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో హైదరాబాద్ వైపు వెళుతున్న కారును వెనుక నుంచి ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. దీంతో ఇంజన్ ఆగిపోయింది. విషయం తెలుసుకున్న చౌటుప్పల్ ట్రాఫిక్ ఏఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌లు కారును అరకిలోమీటర్ పైగా తోసుకుంటూ ఖాళీ ప్రదేశం ఉన్న స్థలంలో నిలిపారు. అదే విధంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ బస్టాండ్ జంక్షన్‌వద్ద జాతీయ రహదారిపై అకస్మాత్తుగా నిలిచిన కారును ట్రాఫిక్ పోలీస్ పక్కకు నెట్టి ప్రయాణికుల ప్రశంసలు అందుకున్నారు. . ఇలా సాయం చేసిన ట్రాఫిక్ పోలీసులను అక్కడున్న వాహనదారులు అభినందించారు.

లక్ష్మీనృసింహుడికి నిత్యారాధనలు


కల్యాణతంతు నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, జనవరి 17: మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యారాధనలు వైభవంగా కొనసాగాయి. ఆలయంలో వేకువజామున సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర కుంకుమార్చన చేశారు. ప్రధానాలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవ నిర్వహించారు. అనంతరం మాంగల్యధారణ, తలంబ్రాలను తమిళనాడు ముక్కురు పీఠం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో కల్యాణతంతు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహామూర్తి, లక్ష్మీనరసింహామూర్తి, సీతారామశాస్త్రీ, శేషగిరిరావు, రాజేష్, రమేష్, పాల్గొన్నారు.

పోరాట యోధుల ఆశయాలు సాధించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్, జనవరి 17: తెలంగాణ సాయుధ పోరాట యోధుల ఆశయాలు సాధించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సాయుధ పోరాటంలో దొడ్డా నర్సయ్య పాత్ర ఎంతో కీలకమైందన్నారు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన గొప్పనాయకుడని కొనియాడారు. నిర్బంధాలకు వ్యతిరేకంగా ఆయన పోరాడి, రహస్య జీవితం గడిపిన గొప్ప నాయకుడన్నారు. 1957లోనే హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజల ఆదరాభిమానాలు పొందారన్నారు. ఆయన ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. చిలుకూరు మండల కేంద్రంలో ఈ నెల 19న సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య వర్థంతి సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఖమ్మం జిల్లా కొత్తగూడ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్టు తెలిపారు. సమావేశంలో గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, రమణపాల్గొన్నారు.

రేబిస్ నివారణకు శునకాలకు టీకాలు

పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు

31 వరకు శునకాలకు రెబిస్ టీకాలు


నేరేడుచర్లలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాసరావు

భానుపురి, నేరేడుచర్ల, జనవరి 17: జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా రేబిస్ వ్యాధి నివారణకు శునకాలకు టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సూర్యాపేటలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో, నేరేడుచర్ల పశువైద్యశాలలో శునకాలకు టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెంపుడు శునకాలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. ప్రాణాంతక రేబిస్ వ్యాధి సోకిన శునకాలు చొంగకారుస్తూ తిరుగుతూ కనిపిస్తాయన్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి సోకకుండా ప్రభుత్వం ఉచితంగా పెంపుడు శునకాలకు వ్యాధి నివారణ టీకాలు ఇస్తోందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు టీకాలు ఉచితంగా వేస్తామన్నారు. జిల్లాలో ఒక్క రోజే 2,516 శునకాలకు టీకాలు వేశామన్నారు. ఇంకా నాలుగు వేల శునకాలకు టీకాలు వేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శంకర్‌నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ రమ్య, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల నుంచి ఎలాంటి వసూళ్లు చేయొద్దు

మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్

భానుపురి, జనవరి 17: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల పేరుతో మత్స్యకారుల నుంచి కొంతమంది డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని, ఈ మేరకు తమ శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని, దీంతో తమకు సంబంధం లేదని మత్స్యశాఖ అధికారి రూపేందర్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసూళ్లకు పాల్పడే వ్యక్తులను మత్స్యకారులు నిలదీయాలన్నారు. ఈ విషయంపై మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఏవైనా ఉంటే సొసైటీల అధ్యక్షులకు అధికారింగా లేఖ వస్తుందన్నారు.

చైనా మాంజాతో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన రంజిత్, సునీతరెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 17: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో చైనా మాంజాతో బుధవారం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లికి చెందిన రంజిత్ కుమార్ స్థానిక విజయదుర్గ రైస్ మిల్లులో హమాలీ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భోజనానికి ఇంటికి వచ్చి తిరిగి రైసుమిల్లుకు వెళ్తుండగా మార్కండేయనగర్ కాలనీలో రోడ్డుకు అడ్డంగా చైనా మాంజా అడ్డొచ్చి మెడకు చుట్టుకుంది. దీంతో ఆయన మెడ భాగంలో కోసుకుపోయింది. హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అదే విధంగా మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామంలో వీబీకేగా పనిచేస్తున్న మేకల సునీతరెడ్డి పని నిమిత్తం కార్యాలయానికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక సాయిరాం థియేటర్ వద్ద శివాజీ విగ్రహం సమీపంలో రోడ్డుపై చైనా మాంజా గొంతుకు తగలడంతో ఆమె మెడకు తీవ్ర గాయమైంది. ఆమె హెల్మెట్ ధరించి ఉండటంతో స్వల్ప గాయాలతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వెంటనే చికిత్స నిమిత్తం భూదాన్‌పోచంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. స్థానిక దుకాణదారులు విపరీతంగా చైనా మాంజాలు విక్రయిస్తుండటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వెంటనే వీటిని నిషేదించాలని స్థానికులు కోరుతున్నారు.

కల్లు గీస్తుండగా గుండెపోటు



మోత్కూరు, జనవరి 17: కల్లు గీసేందుకు చెట్టు ఎక్కిన గీత కార్మికుడు గుండెపోటుతో ప్రాణాలొదిలాడు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు పరిధిలోని రాజన్నగూడేనికి చెందిన సూదగాని లక్ష్మయ్య(70) గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మయ్యకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉండగా అందరికీ వివాహాలు అయ్యాయి. కొంతకాలంగా లక్ష్మయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కల్లు గీసేందుకు బుధవారం ఉదయం తాటి చెట్టు ఎక్కి గెలకు మెర పెడుతుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురై తలకిందులుగా వేలాడాడు. అటుగా వెళుతున్న ఓ రైతు చూసి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు, అగ్నిమాపక, 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్రేన్ సహాయంతో ఒకరు పైకి వెళ్లి కిందకు దించి పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. లక్ష్మయ్య శరీరంపై గాయాలు లేవని, గుండెపోటుతో మృతిచెందారని రామన్నపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న తెలిపారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టులల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్తుకు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించినన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సొహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్. దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్న సాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్తూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందదని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్టు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్గా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే నెంబర్ 66లో 2009-10 పహాణి ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఎంఆర్‌డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవులనియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్లు పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!

(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

» మట్టపల్లి-హుజూర్‌నగర్ రహదారిపై తరచూ ప్రమాదాలు » లేని సూచిక బోర్డులు



జాన్‌పహాడ్‌కు వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

మండలంలో పలు మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మండల కేంద్రం మఠంపల్లి నుంచి జాన్‌పహాడ్, హుజూర్‌నగర్, మట్టపల్లి వైపు వెళ్లే రోడ్లలో పలు ప్రాంతాల్లో మూలమలుపులు ఉన్నాయి. నిత్యం ఏదోఒక మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.

● మఠంపల్లి

వాహనాల ను అతివేగంగా నడుపుతూ అదుపుచేయలేకపోవడం, మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం తదితర కారణాలతో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. మైనర్లు బైక్‌లను వేగంగా నడుపుతూ ప్రమాదాల బారినపడి కన్నవారికి కడుపుకోత మిగుల్చుతున్నారు.



మఠంపల్లి నుంచి దొనబండతండా రోడ్డులో ఎస్ ఆకారంలో ఉన్న ప్రమాదకరమైన మూలమలుపు

మండల కేంద్రం నుంచి మట్టపల్లి, పెదవీడు వెళ్లే రోడ్లతోపాటు మండల కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో ప్రమాదకరమైన మూలమలుపులు, రోడ్లపక్కనే దిగుడు బావులు ఉన్నాయి. మఠంపల్లి నుంచి జాన్‌పహాడ్ వెళ్లే రోడ్డులో దొనబండతండా, లాలితండా, వర్ధాపురం, మంచ్యాతండా శివారుల్లో మూలమలుపులు, బావులు ఉన్నాయి. మండల కేంద్రం నుంచి జాన్‌పహాడ్ వెళ్లే రోడ్డులో మూలమలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డువెంబడి పాత బావులతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. మఠంపల్లి నుంచి కొత్తదొనబండతండా సమీపంలో మూలమలుపు ఎస్ ఆకారంలో ఉండి మరీ ప్రమాదకరంగా ఉంది.ఈరోడ్డులో ప్రతి శుక్రవారం మట్టపల్లి నృసింహుని క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కొత్తగా వచ్చేవారు ఎక్కడ మూలమలుపు ఉందో తెలియక అతివేగంలో వాహనాన్ని అదుపుచేయలేక ప్రమాదాలబారిన పడుతున్నారు. మూలమలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


అధికారులు పట్టించుకోవడం లేదు



మండల కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలు, తండాలకు వెళ్లే రోడ్లలో మూలమలుపులు అధికంగా ఉన్నాయి. ప్రమాదాలు జరిగిన సమయాల్లో హడావిడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. సమస్యను పరిష్కరించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలి.

●మాలోతు సక్రునాయక్, కాల్వపల్లితండా

బావుల వద్ద అడ్డుగోడలు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రం నుంచి జాన్‌పహాడ్, మట్టపల్లి, హుజూర్‌నగర్ వెళ్లే రోడ్లలో మూలమలుపు వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డువెంట బావులు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. హెచ్చరిక బోర్డులు లేనందున ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్, బావులు ఉన్న ప్రాంతాల్లో రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి.

- నాగునాయక్, మఠంపల్లి

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

మఠంపల్లి నుంచి మట్టపల్లి వెళ్లే రహదారితో పాటు మండలకేంద్రం నుంచి జాన్‌పహాడ్ వరకు ఏర్పాటు చేసిన రహదారిలో మూలమలుపుల వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.

-శివకుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ

హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



మఠంపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న లారీ డ్రైవర్లు

మఠంపల్లి, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లారీ డ్రైవర్లు కోరారు. మండల డ్రైవర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మఠంపల్లి-మట్టపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. డ్రైవర్ల వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బానోతు నాగులు, కంటు ఎల్లయ్య, బొడ్డుపల్లి సైదులు, టి.వీరబాబు, రవి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

అర్వపల్లి, ఆత్మకూర్(ఎస్) జనవరి 17: జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఈదుల రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. రాములు కుటుంబ సభ్యులకు గ్రామస్థులు రూ.22,200 ఆర్థికసాయం అందజేశారు. బొల్లంపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి శివకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, పదో తరగతి సహచరులు శివకుమార్ కుటుంబ సభ్యులకు రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్, సర్పంచ్ కుంభం ఉపనాగరాజు, కమటం రాజు, పెద్ది శ్రీనివాస్, బొమ్మెరబోయిన వెంకన్న, బోయపల్లి వీరసోములు, మాదగాని యాదయ్య, నాగరాజు, నర్సింగ్ వెంకన్న, కొప్పుల సోమిరెడ్డి, హరిప్రసాద్, రాంమూర్తి, యోగానందం, సురేష్ పాల్గొన్నారు.

●ఆత్మకూర్(ఎస్) మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన ఉయ్యాల లింగయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఎన్టీఆర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో లింగయ్య స్నేహితులు ఆయన కుటుంబానికి బుధవారం రూ.17,500 ఆర్థికసాయం అందజేశారు. ఇరుముడి సమర్పించడానికి 10రోజుల క్రితం శబరిమలై వెళ్లిన లింగయ్య గుండెపోటుతో మృతి చెందగా, ఆయన దశ దిన కర్మకు హాజరైన స్నేహితులు చేయూతనందించారు. కార్యక్రమంలో కొడదల లక్ష్మణ్, వరికుప్పల వీరేష్, ఒర్సు లింగరాజు, నల్లగొండ వీరన్న, వరికుప్పల ఏడుకొండలు, వరికుప్పల ఎల్లయ్య, వరికుప్పల కనకయ్య, అనిల్, ప్రశాంత్, రవి, నవీన్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలి

హుజూర్‌నగర్, జనవరి 17: అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని 3వ వార్డు కౌన్సిలర్ సంపత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అనేక ప్రగతి పనులు చేపట్టామని, అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. కామిశెట్టి నగర్, చైతన్యకాలనీ, ఎన్‌జీఓ కాలనీలలో సుమారు రూ.50లక్షలతో ప్రగతి పనులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, చందు, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జలాల్‌పురం గ్రామంలో మాట్లాడుతున్న రాంచంద్రయ్య.

తిరుమలగిరి రూరల్, జనవరి 17: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య అన్నారు. బుధవారం జలాల్‌పురం, మొండిచింతతండాలో వికసిత భారత్ సంకల్ప యాత్రపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకుల్లో బీమా కోసం రూ.12చెల్లిస్తే సహజ మరణానికి కూడా రూ.2 లక్షలు చెల్లిస్తారని, గ్యాస్ కనెక్షన్ లేని వారికి ఉచితంగా అందజేస్తారన్నారు. ఆయుష్ భారత్ పథకం కింద ప్రజలకు రూ.5లక్షల బీమా అందజేస్తారన్నారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకన్న, మోహన్‌బాబు, ఆరోగ్య సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బేతవోలు సహకార సంఘ చైర్మన్‌గా సైదులు

చిలుకూరు, జనవరి 17: మండలంలోని బేతవోలు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా బాశం సైదులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సహకార సంఘంలో అవినీతి జరిగిందని డైరెక్టర్లు జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ అనంతరం బాశం సైదులును చైర్మన్‌గా తొలగిస్తూ డీసీవో ఉత్తర్వులు జారీ చేశారు. గత శుక్రవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి డైరెక్టర్లు తాత్కాలిక చైర్మన్‌గా బజ్జూరి రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. అయితే సస్పెన్షన్‌కు గురైన బాశం సైదులు కోఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా, చైర్మన్ తొలగింపుపై స్టే విధించింది. దీంతో సెలవుల అనంతరం జిల్లా అధికారి ఆదేశాల మేరకు బాశం సైదులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, తాత్కాలిక చైర్మన్‌గా ఎన్నికైన రవీందర్‌రెడ్డి చైర్మన్ గదికి వేసిన తాళం తీయకపోవడంతో సొసైటీలో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాళం తీయడంతో సమస్య సద్దుమణిగింది.

'రైతుబంధు' జమ చేయకుంటే ఆందోళనలు నిర్వహిస్తాం

కోదాడ రూరల్, జనవరి 17: యాసంగి పంటల సాగు మొదలై నెల రోజులు గడుస్తున్నా రైతుబంధు నిధులు జమ చేయకపోవడం ప్రభుత్వ వివక్షకు నిదర్శనమని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు విమర్శించారు. ఈ మేరకుస్థానిక తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే రైతుబంధు నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లేనిపక్షంలో తెలుగు రైతుసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22నుంచి తహసీల్దార్ కార్యాలయాలు ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల రూరల్, జనవరి 17: మండలంలోని ఆకుపాముల గ్రామపంచాయతీకి చెందిన సీఐ చెరుపల్లి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ముకుందాపురం గ్రామంలో ఉన్న వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేమూరి సత్యనారాయణ, పోలంపల్లి వెంకట్రామయ్య, పోలంపల్లి వెంకటేశ్వర్లు, ఆశ్రమ నిర్వాహకులు నాగిరెడ్డి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నూతన్‌కల్, జనవరి 17: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఆరాధ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్ అన్నారు. మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో క్రికెట్ పోటీల నిర్వాహకులకు రూ.25వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సోమేశ్వర్, జయపాల్‌నాయక్, ఆచారి, అంబటి రాయల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



మఠంపల్లిలో మాట్లాడుతున్న సయ్యద్ రన్‌మియా

మఠంపల్లి, జనవరి 17: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సయ్యద్ రన్‌మియా కోరారు. గురువారం మఠంపల్లి మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన, అంగన్‌వాడీ, స్వీపర్లు, జీపీ కార్మికులు, హమాలీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రభుత్వాలు జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గుర్రం లింగమ్మ, షైనయ్య, గుర్వారెడ్డి, దేవదానం, లాల్‌సాహెబ్, శాంతకుమారి, పొడిశెట్టి రాము, పద్మ, శాలమ్మ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



మర్రికుంటతండాలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి రూరల్, జనవరి 17: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని చింతలకుంటతండా, మర్రికుంటతండాలో రూ.20 లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీల భవనాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీల భవనాలను పాలక వర్గాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో సమస్యలను ప్రజలు తన దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జాటోత్ రవి, దేవానాయక్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులను ఆరోగ్యంగా చూసుకోవాలి



కుక్కకు రేబీస్ టీకా వేస్తున్న డాక్టర్ వి.రవిప్రసాద్

తుంగతుర్తి, జనవరి 17: పెంపుడు జంతువుల పట్ల యజమానులు జాగ్రతవహిస్తూ ఆరోగ్యంగా చూసుకోవాలని స్థానిక పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వి.రవిప్రసాద్ అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా తుంగతుర్తి పశువైద్య కార్యాలయంలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ వ్యాక్సిన్ అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు నరేష్, మమత, సిబ్బంది సుష్మా, రఘు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

'న్యూడెమోక్రసీ నుంచి వెంకన్నను బహిష్కరించాం'


సూర్యాపేట టౌన్, జనవరి 17: కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న కారింగుల వెంకన్నను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి తొలగించామని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, కాకి మోహన్‌రెడ్డి, కిరణ్, కాశయ్య, మధు, దశరథ, వెంకన్న, అవిలయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

నూతనకల్ పీఏసీఎస్ చైర్మన్‌గా జయసుధ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగం జయసుధ

నూతన్‌కల్, జనవరి 17: నూతన్‌కల్ పీఏసీఎస్ చైర్మన్‌గా వైస్ చైర్మన్ నాగం జయసుధ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జయసుధతో సీఈవో సమ్మెట వెంకయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. గత చైర్మన్ కనకటి వెంకన్న అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడని డైరెక్టర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా, అక్రమాలు వాస్తవమేనని తేలడంతో అతనిని చైర్మన్ పదవితో పాటు, డైరెక్టర్ పదవి సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. నూతన చైర్మన్ మాట్లాడుతూ డైరెక్టర్లతో కలసి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఏలేటి నారాయణరెడ్డి, తొట్ల లక్ష్మయ్య, పసుల వెంకన్న, కాసోజు మదనాచారి, మాతంగి వెంకన్న, మట్టిపల్లి లింగయ్య, లింగయ్య, దాసరి కళమ్మ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్(తెలుగు)పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీజీలో జనరల్, ఓబీసీ అభ్యర్థులు 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు కళాశాలకు వచ్చి స్వయంగా దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

పాలకవీడు: మండలంలోని ఎల్లాపురంలో ఖబరస్థాన్ ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ గోపాల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రూ.8లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మోతీలాల్, వెంకట్ రెడ్డి, జితేందర్ రెడ్డి, శేషురెడ్డి, బాషా, రషీద్ పాల్గొన్నారు.

చిలుకూరు: మండలంలోని నర్సింహాపురం గ్రామంలో శ్రీకోదండరామచంద్రస్వామి దేవాలయంలో శ్రీగోదారంగనాథస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వాముల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. చిలుకూరు మండలం ఆర్లగూడెం గ్రామానికి చెందిన మహిళలు కోలాటం, నృత్యాల ప్రదర్శనతో ఊరేగింపులో పాల్గొన్నారు. . కల్యాణం జరిపించిన ముడుంబై శ్రీకాంతాచార్యులు, కోసూరి శ్రీసాయి బద్రీనాథ్‌ను గ్రామానికి చెందిన శ్రీ కోదండరామస్వామి సేవా సమితి సాంస్కృతిక, సామాజికసేవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

అర్వపల్లి: కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన తహసీల్దార్ సత్యనారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని వీఆర్ఏల హక్కుల రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి వీరన్న అన్నారు. అర్వపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి వేతనాలు రానందున ఆర్థిక ఇబ్బందులతో శ్రీకాంత్ మనోవేదనకు గురయ్యారని తెలిపారు. కార్యక్రమంలో బుగ్గం చరణ్‌రాజు, చిత్తలూరి స్వామి, మాదాసు నర్సింహ, రామస్వామి, మౌనిక, బందెల వీరస్వామి పాల్గొన్నారు.

నాగారం: ఇళ్ల నిర్మాణాలకు యజమానులు అనుమతులు తీసుకోవాలని ఎంపీవో దారా శ్రీనివాసు కోరారు. వర్ధమానుకోట పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనుమతిలేని ఇళ్ల నిర్మాణాలను గుర్తించి , నిలిపివేయాలని నిర్మాణాలు చేపట్టవద్దని, అలాంటి నిర్మాణాలను గుర్తించి నిలుపుదల చేయాలని పంచాయతీ కార్యదర్శికి ఎంపివో ఆదేశించారు. వీధులలో మురికి నీటిని వదలవద్దని పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలని గ్రామస్థులకు తెలిపారు. వీధులల్లో మురికి నీటిని వదులుతున్న ఇంటి యాజమానులకు గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి నోటిసలు అందజేశారు. ఎంపివో వెంట పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, బిల్ కలెక్టర్ శ్రీనివాసు చారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు..

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నూతనకల్ మండలంలో కారు ఢీకొన్న ఘటనలో ఒకరు, ఆత్మకూరు(ఎస్) మండలంలో నెమ్మికల్ గ్రామ శివారులో బైక్ అదుపు కిందపడడంతో యువకుడు దుర్మరణం చెందారు. మునగాల మండలంలో జరిగిన ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా మారింది. అదే విధంగా నూతనకల్ మండలంలో జరిగిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి.



రామాంజనేయాచారి మృతదేహం

నూతన్‌కల్, జనవరి 17: మండల కేంద్రంలో కారు, బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలకేంద్రానికి చెందిన తూర్పాటి గణేష్(23), పెండెం శ్రీను, దానబోయిన సాంబయ్య(నూతన్‌కల్), రోహిత్ (తొర్రూర్)లు ఆత్మకూర్(ఎస్) మండలం ముక్కుడుదేవులపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన గ్రామీణ కబడ్డీ క్రీడల్లో పాల్గొన్నారు. తిరిగి నలుగురు ద్విచక్రవాహనంపై వస్తుండగా నూతన్‌కల్ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద తొర్రూర్ నుంచి వస్తున్న కారు ఎదురుగా బైక్‌ను ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న గణేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా నలుగురితోపాటు కారు నడుపుతున్న వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సన్నూరు గ్రామానికి చెందిన చిన్నపాక చందుకు సైతం గాయాలైనట్లు తెలిపారు. గణేష్ పెద్దమ్మ ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి..

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపైనుంచి పడి మంగళవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన ఒల్లోజు రామాంజనేయాచారి(38) సూర్యాపేట మునిసిపాలిటీ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ కింద ఎలక్ట్రీసియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని అత్తగారు గ్రామమైన ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్లకు బైక్ మీద వెళ్లి తిరిగి రాత్రి సమయంలో వెళుతుండగా, నెమ్మికల్ గ్రామశివారులో కాటమయ్య ఆలయ సమీపంలో బైక్ అదుపు తప్పి పక్కన ఉన్న పంట కాల్వలో పడింది. ఈ ఘటనలో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం చేశారు. రామాంజనేయాచారి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. రామాంజనేయాచారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆగిన కారును ఢీకొట్టిన మరో కారు

మునగాల: ఓ డ్రైవర్ మితిమీరిన వేగంతో కారు నడిపి, రోడ్డు పక్కన ఆగిన కారును ఢీకొట్టడంతో ఎనిమిది తీవ్రగాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా మారిన ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన రామిని సతీష్‌రెడ్డి, భార్య సృజన, ఇద్దరు పిల్లలు యశిక, హవ్యాన్ష్, అదే గ్రామానికి చెందిన స్నేహితుడు బత్తుల శేఖర్, భార్య అపూర్వ కలిసి గ్రామం నుంచి బుధవారం ఉదయం కారులో హైదరాబాద్ వెళుతున్నారు. ఈ క్రమంలో మునగాల సమీపాన కారు సాంకేతిక లోపంతో ఆగింది. రోడ్డు పక్కన ఆపి మరమ్మతులు చేస్తుండగా, విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి ఆగిన కారును ఢీకొట్టింది. దీంతో ఆగి ఉన్న కారు ఎగిరి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బత్తుల శేఖర్, భార్య అపూర్వ, రామిని సృజనకు తీవ్రగాయాలు కాగా, కారులో ప్రయాణిస్తున్న కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన కాసెట్టి ప్రతీష్, కుటుంబ సభ్యులు కాసెట్టి వెంకటరమణ, కాసెట్టి మోక్ష, కాసెట్టి లీలావెంకటలక్ష్మి, కాసెట్టి ఆద్యలకు గాయాలయ్యాయి. వీరిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తరలించారు. ఇరువురి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్‌పేలి ఇద్దరికి తీవ్ర గాయలు



గాయపడిన అమ్రూనాయక్

తుంగతుర్తి, జనవరి 17: ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం మండలంలోని ఏనకుంట తండాలో ఈ ఘటన జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు అమ్రూనాయక్ తన మనుమరాలు జ్యోత్స్నతో కలిసి ఇంట్లో ఉండగా గ్యాస్ సిలిండర్ పేలింది. వారికి తీవ్ర గాయాలు కాగా సూర్యాపేట జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కి తరలించనున్నట్లు బంధువులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దిరాల, జనవరి 17: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం మద్దిరాల మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామంలో రేషన్ డీలర్ పొన్నాల పద్మయ్య ఎనిమిది క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా గ్రామస్థుల సమాచారం మేరకు పట్టుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వీరసోములు తెలిపారు. రేషన్ బియ్యాన్ని మహబూబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రేపోని గ్రామానికి చెందిన వెలిశాల నర్సయ్య, రేసు శంకర్‌కు విక్రయించేందుకు రేషన్ డీలర్ పొన్నాల పద్మయ్య ఇంటి ఎదుట ట్రాక్టర్‌లో తరలిస్తుండగా, దాడి చేసి బియ్యం, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. వారిపై సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.